


# అడల్ట్స్ ఓన్లీ కథ A

# అనుభూతి పర్వం



కె.కె. భాగ్యశ్రీ

''కోనసీమలో అడుగిడుతున్న కొత్త దంపతులకు హార్దిక స్వాగతం''

ట్రైన్ దిగుతూనే ఆహ్వానం పలికిన ప్రాణమిత్రుడు సూరిబాబుని చూసి చిరునవ్వు నవ్వాడు అనిరుద్ధ్.

వెంటనే అభివాదం చేస్తున్నట్లుగా వంగి ''ధన్యవాదాలు మిత్రమా'' అన్నాడు అదే శైలిలో.

''జర్నీ బాగా జరిగిందా'' కుశల ప్రశ్నలు వేశాడు సూరిబాబు.

''ఆ..అంతా హ్యాపీగానే జరిగింది'' సమాధానం చెబుతూనే, ఇంకా ట్రైన్ దిగని అర్ధాంగికి చేయి అందించాడు అనిరుద్ధ్.

నెమ్మదిగా ట్రైన్ దిగింది అమూల్య.

చేతులకి పాదాలకి సింధూర వర్ణాన్ని అలదుకొని తళుకులీనుకున్న మెహందీ డిజైన్లు, మెడలో బంగారు నగలకన్నా మిల మిల మెరుస్తున్న పచ్చని పసుపుతాడు, అందమైన ముఖారవిందంలో కలబోసుకుని అలుముకున్న సిగ్గుబిడియాల దొంతరలు ఇవన్నీ చెప్పకనే చెబుతున్నాయి ఆమె నవ వధువని.

''ఆహా! ఏమి నా భాగ్యము! అనుకోని అవాంతరాల వల్ల మీ పెళ్లికి రాలేకపోయాను. అనుకోకుండా మీ 'పాణగ్రహణం' చూసే అదృష్టం పట్టింది నాకు'' ఛలోక్తి విసిరాడు సూరిబాబు.

''అమూల్య నేను చెప్పానే..నా ప్రాణసఖుడు, జిగరీ దోస్త్..ఎట్సెట్రా..ఎట్సెట్రా..అన్నీ వీడే సూరిబాబు నామధేయుడు'' అంటూ భార్యకి పరిచయం చేశాడు.

రెండు చేతులూ జోడించింది అమూల్య.

''రండమ్మా..ప్రయాణం చేసి చాలా అలసిపోయుంటారు. ఇంటికెళ్లి రెస్ట్ తీసుకుందురుగాని'' స్టేషన్ బయట పార్క్ చేసిన టాటా సుమో వైపు నడిచాడు సూరిబాబు.

వెనక సీట్లో కూర్చున్నారు అమూల్య, అనిరుద్ధ్.

కోనసీమకే ఎనలేని అందాలు సమకూర్చే కొబ్బరి చెట్లు వీరి రాకకు సంతసించి స్వాగత గీతి ఆలాపిస్తున్నట్లుగా గలగలమని శబ్దం చేస్తూ వింజామరలు వీచాయి.

**శృంగార కథల పోటీలో మొదటి బహుమతి అందుకున్న రచన**

గతుకుల బాటలో కార్ సాగిపోతూంటే కుదుపులకు లోనై ఒకరి శరీరాలింకొకరికి ఒరుసుకొని గమ్మత్తుగా ఫీలైంది అమూల్య.

క్రీగంట భర్తవైపు చూసింది. కార్‌డ్రైవ్ చేస్తూనే వసపిట్టలా వాగుతున్న సూరిబాబుతో సంభాషణలో మునిగిపోయి ఉన్నాడు అనిరుద్ధ్.

అసలు అతడి ఆంతర్యం ఏమిటో ఆమెకు ఇప్పటికీ బోధపడడం లేదు.

హనీమూన్ అనగానే కాశ్మీర్ లోయలు, ఊటీ-కులుమనాలి తదితర సుందర ప్రదేశాలు దర్శిస్తారే నవదంపతులెవరైనా...కాని...ఇలా కోనసీమలోని ఓ మారుమూల పల్లెటూరికి ప్రయాణం కట్టించాడెందుకో అర్థం కావడం లేదు.

ప్రయాణంలో ఒళ్లు హూనమైనట్లుగా ఉండటంతో ఆమె ప్రమేయం లేకుండానే కళ్లు మూతలు పడ్డాయి అమూల్యకి.

★ ★ ★

అనిరుద్ధ్ ఆరడుగుల అందగాడు. ఒకానొక ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. తను పనిచేస్తున్న కంపెనీ తరపున ప్రాజెక్ట్ వర్క్ కోసం అమెరికా వెళ్లనున్నాడు. రెండు మూడు సంవత్సరాలు అక్కడే ఉండవలసి వస్తుందేమో కూడా. అతడిని ఒంటరిగా పంపడం ఇష్టంలేని తల్లిదండ్రులు పెళ్లి చేసేసి సతీసమేతంగా అమెరికా పంపాలని యోచించారు.

మధ్యవర్తుల ద్వారా అనిరుద్ధ్‌కి అన్ని విధాల సరిపోయే అమ్మాయి అమూల్యేనని తెలుసుకుని పెళ్లిచూపులకొచ్చారు.


పొందికైన అమూల్య సౌందర్యం అనిరుద్ధ్‌నే కాదు అతడి కన్నవారినీ ఆకట్టుకుంది.

చామనఛాయ కన్నా మెరుగైన దేహఛాయ, విశాల నేత్రాలు, సంపెంగని సవాల్ చేసే నాసిక, వంపు తిరిగిన పైపెదవి, కొద్దిగా లావుగా అనిపించే క్రింది పెదవి..మధ్యస్తంగా ఉన్న అవయవ సౌష్టవం..వెరసి అమూల్య వెన్నెల బొమ్మలా ఉంది. అందానికి చిరునామాలా ఉంది. ఆ ముగ్ధమోహన సౌందర్యరాశి అనిరుద్ధ్ హృదయాన్ని అమాంతం కొల్లగొట్టింది.

బంగారానికి తావి అబ్బినట్లుగా, అందానికి అణుకువ తోడైంది. అనిరుద్ధ్ అంగీకారం తెలపడంతో పెళ్లి ముహూర్తాలు పెట్టేశారు వెంటనే.

అమూల్య వంటి అందాల భరిణెకి, అమెరికా వెళ్లబోయే వరుడు దొరికాడని పొంగిపోయిన ఆమె కన్నవారు అంగరంగ వైభోగంగా కళ్యాణం జరిపించారు.

గతంలో ఎప్పుడో అనిరుద్ధ్ తల్లి తిరుపతి వెంకన్నకు మొక్కుకుంది కుటుంబ సమేతంగా కొండకు విచ్చేసి కళ్యాణం జరిపించుకుంటామని. ఆ సందర్భంగా పెళ్లయిన మరునాడే తిరుపతి ప్రయాణమయ్యారందరూ.




''బాబూ...అటుంచి వచ్చిన తరువాత మా ఇంట్లోనే 'ఆ ముచ్చట' కాస్తా జరిపించేస్తాం. ఆ తరువాత మీ ఇష్టమొచ్చిన చోటుకి హనీమూన్‌కి వెళ్దురు గాని..ఏర్పాట్లన్నీ చేస్తాను''

మామగారి మాటలకు అభ్యంతరం చెప్పాడు అనిరుద్ధ్. ''పెళ్లి చేయడం వరకు మీ బాధ్యత. ఆ తరువాత విషయాలు మేం చూసుకుంటాం. మీరు అనవసరంగా హైరానా పడకండి'' సున్నితంగానే అయినా కరాఖండీగానే చెప్పేశాడు.

''కాని బాబూ..మనకంటూ కొన్ని సంప్రదాయాలున్నాయి. శుభముహూర్తంలో గర్భాదానం జరగడం ఇరువురికీ శ్రేయస్కరం'' లోపలికి పిలిచిన శ్రీమతి తన చెవులు కొరికిన తరువాత బయటకు వచ్చిన అమూల్య తండ్రి అన్నాడు.

''నేను ఆధునికుడినే గాని..అనాదిగా వస్తున్న ఆచార వ్యవహారాల్ని కాదనుకునే మూర్ఖుడిని కాదు. మేం ఎక్కడున్నా మీరు చెప్పిన సుముహూర్తాన్ని దృష్టిలో పెట్టుకుని అదేవిధంగా ఆచరిస్తాంలెండి. మీరు నిశ్చింతగా ఉండండి'' అల్లుడిచ్చిన అభయం అమూల్య తండ్రిని ఊరడిల్లేలా చేసింది.

పర్యవసానంగా తిరుపతి వెంకన్నకు కళ్యాణ కార్యక్రమం జరిపించుకొని అందరూ హైదరాబాద్ పయనమైతే నవదంపతులు రాజమండ్రి బయలుదేరారు.

★ ★ ★

''అమూల్యా..లే..ఇల్లొచ్చేసింది'' అనిరుద్ధ్ మృదువైన పిలుపుతో కళ్లు తెరిచిన అమూల్య తను అతడి ఒడిలో ఉండటం చూసి చటుక్కున లేచి సర్దుకు కూర్చుంది. సిగ్గు బరువుతో ముఖం కందిపోయింది.

''బడలికకి నిద్ర పట్టేసినట్లుంది'' నవ్వాడు అనిరుద్ధ్. ఇంతసేపూ తను అతడి ఒడిలో సేదతీరిందని తెలుసుకోగానే మనసంతా వింత పులకింతకు లోనైంది.

''దిగు చెల్లెమ్మా..దిగరా బావా..నీకు ప్రత్యేక

## స్వపరిచయం



విజయనగరంలో జననం. బి.ఏ., హిందీ ప్రవీణ విద్యార్హతలు. సంగీత సాహిత్యాల పట్ల అభిరుచి, సంగీతంలో కొద్దిపాటి ప్రవేశం, బాగా వ్రాయాలన్న తపన తప్ప నా గురించి చెప్పుకొనేందుకేమీ లేదు.

1998లో నా తొలికథ 'మనది కానిది' ప్రచురించి, నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన మాతృసంస్థ ఆంధ్రభూమి వారు నిర్వహించిన ఈ శృంగార కథల పోటీలో ప్రథమ బహుమతి పొందడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

శ్రీవారు, రచయిత అయిన కె.కె.రఘునందనగారు నా రచనా వ్యాసంగం నిర్విఘ్నంగా సాగడానికి తగు ప్రోత్సాహం అందిస్తూ ఉంటారు.

ఇటీవలే స్వర్గస్థులైన మా నాన్నగారు పరాంకుశదాసుగారి ఆశీస్సులు సదా నా వెన్నంటి ఉంటాయని నమ్ముతున్నాను.

నేను ముందుకు నడిచేందుకు సహకరిస్తున్న అనేకమంది సాహితీ బంధువులకు ఆంధ్రభూమి ద్వారా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

గతంలో ఆంధ్రభూమి దినపత్రిక వారు నిర్వహించిన సంక్రాంతి కథల పోటీలో 'వాస్తవం' కథకు తృతీయ బహుమతి లభించింది. మరొకసారి ఈ పోటీలో నాకు బహుమతి నందించిన ఆంధ్రభూమికి కృతజ్ఞతలు.

దగ్గర దగ్గర వంద కథలు, నాలుగు సీరియల్స్, రెండు అనుబంధ నవలలు ప్రచురింపబడ్డాయి.

స్వాతి సపరివార పత్రిక వారు నిర్వహించిన పదహారు వారాల సీరియల్ పోటీలో 'సాహిత్య', 'తీయని తలపులు' సీరియల్స్‌కు బహుమతులు అందుకున్నాను. అలాగే సరసమైన కథల పోటీలో మూడుసార్లు బహుమతి పొందాను.

సాహిత్యం నవరసభరితం అన్నారు. తన రచనలో అన్ని రసాలను మేళవించి, పాఠకులను అలరించేవాడే నిజమైన రచయిత.

నుతిమెత్తని, శృతిమించని శృంగారానికి సాహిత్యంలో ఎప్పుడూ స్థానం ఉంటుందని నమ్ముతున్నాను.

పాఠకదేవుళ్ల అభిమానం ఎప్పటికీ ఇలాగే ఉండాలని ఆశిస్తూ, ఆంధ్రభూమికి మరొక్కమారు కృతజ్ఞతలతో..

-కె.కె.భాగ్యశ్రీ

ఆహ్వానాలేం పలకక్కర్లేదు..మా ఇంటికి నువ్వు పాతకాపువేగా'' నవ్వాడు సూరిబాబు.

''మాటి మాటికీ పెంకులెగిరేలా నవ్వడం నీ మానరిజం అని మీ చెల్లెలికీపాటికి అర్థమయ్యే ఉంటుంది'' అంటూ కార్ దిగాడు అనిరుద్ధ్.

''అంతేనంటావా!'' మరోమారు నవ్వాడు సూరిబాబు. లోపలినుండి చాలామంది బిలబిలమంటూ విచ్చేశారు. చూడముచ్చటైన ఉమ్మడి కుటుంబం వారిది. అందరినీ పేరు పేరు వరుసనా పరిచయం చేశాడు సూరిబాబు.

వినయంగా నమస్కరించింది అమూల్య.

మనసులో ఏదో గుబులు..దాంపత్య జీవితం గురించి బయటకు చెప్పుకోలేని వింత వింత భయాలతో గుబగుబలాడుతున్న తనను ఇంతమంది అపరిచితుల మధ్యకు తెచ్చిపడేశాడు తన మొగుడు.

వీరందరితో ఎలా గడపాలో ఏమో!

''రండి'' అంటూ సూరిబాబు లోపలికి దారి తీస్తుండగా..

''ఆగండాగండీ..పేర్లు చెప్పనిదే లోపలికి పోనివ్వం'' అంటూ చొరవగా ముందుకొచ్చేసి, ఎర్ర నీళ్ళతో దిష్టితీసి, హారతిచ్చింది ఓ యువతి.

''అవన్నీ పెళ్లిలో అయ్యాయి లేమ్మా'' తప్పించుకోజూశాడు అనిరుద్ధ్.

''ఆ పప్పులేం ఉడకవన్నయ్యా..మేం మీ పెళ్లి వేడుకలను చూడలేదు గనుక..మీరు మళ్లీ పేర్లు చెప్పవలసిందే'' పట్టుపట్టింది ఆమె.

''నువ్వాగవే'' అంటూ ఆమెను వారించి ''ఇంతకీ ఈ లలనామణి ఎవరో చెప్పనేలేదు కదూ..పద్మావతి..నా శ్రీమతి..నా అర్ధభాగం''

ఇంకా ఏవేవో చెప్పబోతున్న సూరిబాబు కాలి మీద తన కాలితో గట్టిగా నొక్కింది పద్మ.

'కెవ్వు'మని అరచి ''ఔరా! ఏమి ఈ పాద పీడనం'' రేలంగి లెవెల్లో అభినయిస్తున్న సూరిబాబుని చూసి అందరూ పడిపడి నవ్వారు.

ఈ సందట్లో లోపలికి జారుకోబోతున్న అనిరుద్ధ్‌ని అటకాయిస్తూ ''ఆగవయ్యా అగ్రజా..నామధేయముల నుడివి, గృహప్రవేశం గావింపుడు'' అంది పద్మ నాటకీయంగా.

నిస్సహాయంగా చూస్తూ ''నేను, అమూల్య వచ్చాం'' అన్నాడు అనిరుద్ధ్.

అతడి నోటివెంట తన పేరు పలకడంలో ఎంతటి మాధుర్యం ఒలికిందో గమనించిన అమూల్య మనసు మురిసింది.

''నేను, అనిరుద్ధ్‌గారు వచ్చాం'' సన్నగా పలికింది.

''ఆ..ఏంటీ..వినబడడం లేదు..మరీ అంత సుకుమారం అయితే ఎలా మరదలా! పట్నం అమ్మాయిలు చాలా ఫాస్టని విన్నాం..నువ్వేంటి ఇంత స్లోమోషన్‌లో,'' మేలమాడింది పద్మ.

అమూల్య తలదించుకుంది చెక్కిళ్లలో అలముకున్న కెంజాయ వర్ణం ఆమె కంటపడకుండా.

''చాల్లేమ్మా..అసలే కొత్త పెళ్లికూతురు..నీ అల్లరితో ఓదరగొట్టకు'' వారించింది సూరిబాబు తల్లి.

సాదరంగా లోపలికి ఆహ్వానించారు సూరిబాబు తాతయ్య, నాన్నమ్మ. నలుగుపెట్టి, కుంకుడుకాయ పులుసుతో తలంటింది పనిమనిషి. మొదట కాస్త సిగ్గుగా అనిపించినా పల్లెటూరి అలవాట్లు వింతగా తోచడంతో కిక్కురుమనలేదు అమూల్య.

అభ్యంగన స్నానమాచరించడంతో ప్రయాణ బడలిక తీరిపోయి ఒళ్లంతా, హాయిగా తేలిగ్గా అనిపించింది ఆమెకి.

లేత గులాబీరంగు కాటన్ శారీలో ఒప్పులకుప్ప లాంటి అమూల్య సౌందర్యం విలక్షణంగా వెలిగిపోవడం చూసిన అనిరుద్ధ్ నయనాలు నక్షత్రాల్లా తళతళలాడాయి. చీరకి, జాకెట్‌కి మధ్యన కాంతులు విరజిమ్ముతున్న నెలవంకలాంటి నడుం ఒంపును చూసి మోహంతో మత్తెక్కిపోయాడతడు.

''అమూల్యా''

''ఊ...'' అన్నాననుకుంది ఆమె. కాని మాటలు పెగల్లేదు.

''ఈ బ్యూటిఫుల్ కర్వ్..ఎంత రొమాంటిగ్గా ఉందో తెలుసా?'' మునివేళ్లతో ఆ ముడతను సవరించాడతడు. ఆ నునుపుకి జారాయి చేతివ్రేళ్లు.

అమూల్య ఒళ్లంతా వింతైన పరవశంతో నిండిపోయింది. సుతిమెత్తని హాయి నిలువెల్లా కమ్మేసింది.

లజ్జా భారంతో అరమోడ్పులైన వాలుకన్నుల సౌందర్యాన్ని, తన కన్నుల గిన్నెల నిండా నింపుకొని..చటుక్కున వంగి ఆమె నడుం ఒంపులో పెదవులాన్చాడు అనిరుద్ధ్.

ఇదీ..అని నిర్వచించలేని చిత్రమైన తాదాత్మ్యం ఆమెను లోబరుచుకుంది. అధరాలు వణికాయి. కుసుమ కోమలమైన కంఠం కొద్దిగా కంపించింది.

''ఒరేయ్ బావా'' బయట నుండి సూరిబాబు పొలికేక పెట్టడంతో దూరంగా జరిగాడు అనిరుద్ధ్.

అమూల్య హృదయ స్పందన అధికమైంది. నేల చూపులు చూస్తూ నిలబడిన ఆమె బుగ్గమీద చిటికేస్తూ ''మీవాళ్లు పెట్టిన ముహూర్తానికింకా నాలుగు రోజులు టైముంది. అంతదాకా ఎలా ఆగాలో..ఇంతటి అందాన్ని చూస్తూ ఎంతలా వేగిపోవాలో'' చిలిపిగా కన్నుగీటి బయటికి వెళ్లిపోయాడు అనిరుద్ధ్. ఆమె మనసు మధుకలశమైంది. తనువు తమకంతో తహతహలాడింది.

అతడు స్పృశించిన నడుమును అపురూపంగా తడుముకుంటూ ఉండిపోయింది ఎంతోసేపు.

★ ★ ★

మర్నాటికే సూరిబాబు ఇంట్లోని వారితో ఎంతో కలిసిపోయింది అమూల్య.

ఎంతో ఆప్యాయంగా పలకరించి, ఆత్మీయంగా మెలిగేవారి సహృదయాలకు ముచ్చటపడింది.

ఇంట్లో ఎన్ని జంటలున్నాయో అందరికీ సెపరేట్ బెడ్‌రూమ్స్ ఉన్నాయి. ఆఖరికి వృద్ధ దంపతులతో సహా. ముఖ్యంగా ఆ ముసలి జంట నడుమ సయోధ్య చూస్తే అమూల్యకి ఎంతో అబ్బురంగా అనిపించేది. ఈ వయసులో కూడా అనుక్షణం నీడలా భార్యని వెన్నంటి ఉండే తాతగారి వైఖరి ఆమెకు సంభ్రమానందాలను కలిగించేది. యాభై ఏళ్లు నిండకుండానే ముసలివాళ్లమైపోయామని భావించి, ముద్దు మురిపాలకు దూరమైన తల్లిదండ్రులు గుర్తొచ్చారు.

''ఇప్పటికీ మీ తాతగారు నన్ను 'పిల్లా' అనే పిలుస్తారే అమ్మాయ్!'' చెప్పింది ముసలామె తన బోసి నోటిని తెరచి నవ్వుతూ.

''ఆ..ఎంతో బాగుందీ బోసి నోటి పిల్ల'' గడుసుగా నవ్వింది సూరిబాబు తల్లి ఆవిడ వినకుండా.

అమూల్య ముసి ముసిగా నవ్వింది.

ఆ సాయంత్రం ఏదో అవసరమై పద్మ కోసమని వాళ్ల గదిలోకి వెళ్లబోయిన ఆమె ఏవో గుసగుసలు వినబడడంతో గమ్మంలోనే ఆగిపోయింది.


''ఏంటోయ్ సూరిబాబూ..తెగరెచ్చిపోతున్నావ్. వేళాపాళా లేదా..అవతల అతిథులున్నారు. కాస్త తగ్గు బాబూ'' మత్తైన కంఠంతో మగని మందలిస్తోంది పద్మ.

''నువ్విలా మన పెళ్లినాటి పద్మలా..కన్పిస్తూ..కవ్విస్తూ ఉంటే నేనెలా ఆగగలనే అన్నుల మిన్నా'' మోహం నిండిన సూరిబాబు స్వరం వినిపిస్తోంది.

అమూల్య తత్తరపాటుతో తన గదిలోకి వెళ్లిపోయింది. ఏడేళ్లు కాపురం చేసి, ఇద్దరు బిడ్డల తల్లైన భార్యపట్ల, ఇంకా కొత్తపెళ్లాం పట్ల భర్త చూపించే మోజునే కలిగి ఉన్నాడా సూరిబాబు!

పెళ్లైన రెండేళ్లకే భార్య అనారోగ్యం పాలైందని సెకండ్ సెటప్ ఏర్పరచుకున్న బావ గుర్తొచ్చాడు అప్రయత్నంగా.

దాంపత్యంలో ప్రతీక్షణం ఉద్విగ్న భరితంగా, నవనవోన్మేషంగా ఉండడం అసాధ్యమనుకునేది తను ఇన్నాళ్లూ..కానీ, అదీ



సాధ్యమేననిపిస్తోందిప్పుడు.

అమూల్య గుండెలింకా అదురుతూనే ఉన్నాయి.

''ఏంటి అమూల్య.. అలా ఉన్నావు? ఒంట్లో బాగులేదా?'' లాలనగా నుదుటిమీద చేయివేశాడు అప్పుడే బాత్ రూమ్‌లోంచి వచ్చిన అనిరుద్ధ్.

బాగానే ఉందన్నట్టుగా తలాడించింది అమూల్య. ఒంటిమీద టవల్ తప్ప వేరే ఆచ్ఛాదనేదీ లేకుండా తనకి అత్యంత సమీపంగా నిలబడిన అతడిని చూస్తూంటేనే వింత భావనేదో కదులుతోంది మదిలో.

వచ్చని ఛాతీమీద మంచి ముత్యాల్లాంటి నీటి బిందువులు, గ్రీకు వీరుడిలా తన చెంత నిలబడిన భర్తను చూస్తే ఆమె హృదయగతి అదుపు తప్పు తోంది.

''ఓ.. ఫస్ట్‌నైట్ అంటే టెన్షన్‌గా ఉందా! నీకో నిజం చెప్పనా డియర్.. నాక్కూడా చా.. లా.. టెన్షన్‌గా ఉంది'' కొంటెగా నవ్వాడు అనిరుద్ధ్.

వివశురాలైంది అమూల్య.

''ఇంకెంతసేపు మన ఎదురుచూపులు. కౌంట్ డౌన్ షురూ అయ్యింది'' గుసగుసగా అని డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకు వెళ్లాడు అనిరుద్ధ్.

★ ★ ★

ఇంట్లో ఉన్న దంపతులందరి మధ్యన వెల్లివిరిసిన అన్యోన్యతను, ఆప్యాయతను చూస్తున్న అమూల్య మనసు దాంపత్య జీవితం పట్ల అనురక్తమౌతోంది.

అనిరుద్ధ్ ప్రేమపూర్వక ప్రవర్తన, ఆమెను పట్టిపీడిస్తున్న భయాందోళనలను పార్రదోలింది.

ఆరోజు సాయంత్రం అయిదవగానే అమూల్యను అత్తరు-పన్నీరు కలిపిన నీటితో జలకాలాండించారు ఇంట్లోని ముత్తయిదువులు. ఆపాదమస్తకమూ అత్యంత రమణీయంగా తీర్చిదిద్దారు. తెల్లటి జరీ చీరలో, మల్లెమొగ్గలు, జాజులతో అందంగా అల్లిన పూలజడతో.. ముత్యాలనగలతో అప్సరసలా వెలిగిపోతోంది అమూల్య.

ఉన్నతమైన హృదయసీమను అధిరోహించిన భాగ్యం తనదేనని విర్రవీగింది ఆమె మెడలోని హారంలో గల కెంపుల పతకం. నడుము నంటి పెట్టుకొనే అదృష్టం లభించిందని మురిసిపోయింది మువ్వల వడ్డాణం.

తెల్లని పంచె.. లాల్చీలలో నవమన్మథుడిలా, నలకూబరుడిలా ఉన్నాడు అనిరుద్ధ్.

ఆరుగంటలు దాటాక పీటల మీద కూర్చోబెట్టి తంతు జరిపించాడు పురోహితుడు.

నవదంపతుల చేత అందరికీ దంపతి తాంబూలాలిప్పించారు. గర్భాదాన ముహూర్త ప్రాశస్త్యం గురించి అందరికీ వివరించారు తాతగారు పెద్దగొంతుతో.

బహిరంగంగా జరుగుతున్న ఈ తంతంతా చిరాకును, సిగ్గును కలిగిస్తున్నా.. మదిలో భద్రపరచుకోవలసిన అనుభూతి పరంపరలకు ఇది ఆరంభం కాబట్టి సంతోషంగానే ఆ వేడుకలో పాలుపంచుకున్నారు అమూల్య, అనిరుద్ధ్. ఒక ప్రక్క ఆడంగులు వదులుతున్న ద్వంద్వార్థపు మాటలకు ఒళ్లు సిగ్గుతో చచ్చిపోయినట్లనిపించింది అమూల్యకి.

ఆమె ఇబ్బందిని గమనించిన పద్మ అంది ''పల్లెటూరి వాళ్లం కదా.. ఇలాంటి మోటు హాస్యాలు మామూలే.. ఇవన్నీ పెళ్లికూతురి మనసులోని బెరుకును పోగొట్టే తారకమంత్రాలు.. అలవాటయిపోతే నువ్వూ ఎంజాయ్ చేస్తావు''

ఆమె మాటల్లో సత్యం గమనించింది అమూల్య.

''ఇంక పదండి'' అమూల్య దగ్గరగా వచ్చిన సూరిబాబు తల్లి దేవకి అంది.

''ఎక్కడికి?'' ఆశ్చర్యంగా అడిగింది అమూల్య.

''అయ్యో నా మతిమండా.. నీకు చెప్పనే లేదు కదూ.. మా ఇంట్లో జరిగే శుభకార్యాలన్నింటినీ మా తోటలో ఉండే ఇంట్లో జరిపించడం మా ఆనవాయితీ. మీరు మా ఇంటి మనుషులే కాబట్టి.. మీకూ అక్కడే'' వివరించింది దేవకి.

వారి అభిమానానికి గుండె బరువెక్కింది.

''ఇదీ బాగానే ఉంది. కావలసిన ఏకాంతంలో కమ్మని అనుభవాలు పండించుకోవచ్చు'' అనుకున్నాడు అనిరుద్ధ్.

ఊరికి దూరంగా, ప్రశాంతమైన వాతావరణంలో ఉన్న కొబ్బరితోట అది. కనుచూపు మేరంతా పచ్చదనం తాండవిస్తూ కనువిందు చేస్తోంది.

ప్రక్కనే ఉన్న మల్లెతోటలో నిండా విరబూసిన మల్లియలు ఆ ప్రాంతాన్నంతా పరిమళభరితం చేస్తున్నాయి.

పర్ణశాలలా ఉన్న ఆ ఇంటిని చూసి ముచ్చటపడింది అమూల్య. ఆ పైన ఏముంది ఆ మూల గదిలోన.. ఆరు తరముల నాటి ఆ పట్టెమంచం.

ఓ పాటలోని పంక్తి జ్ఞాపకమొచ్చింది. వివిధ రకాల విరులతో అలంకరించబడి, కోరికలు పండించుకోమని ఆహ్వానిస్తున్న తాతల నాటి పందిరి పట్టెమంచాన్ని చూడగానే.. అగరు పొగలు అలుముకున్నాయి ఆ గదిలో అప్పటికే.

ఇరువురినీ మంచం మీద కూర్చోబెట్టి పూలబంతులాండించారు ఆడంగులు.

ఒకరి ఎంగిల్లొకరికి తినిపించారు. ముహూర్తం ఆసన్నమవగానే ఇరువురినీ ఏకాంత వాసం కోసం విడిచిపెట్టి బయలుదేరారందరూ.

''ఏం కావాల్సినా ఓ ఫోన్ కొట్టు బావా... క్షణాల్లో ఏర్పాటు చేస్తాను. ఈ రాత్రి మీ జీవితాల్లో మరువలేని మాధుర్యాన్ని నింపాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను'' చెప్పాడు సూరిబాబు.

''వయసు వాకిళ్లు తెరచి, వలపు పొంగళ్లే వండుకుంటారో, చిలిపి సందళ్లే చేసుకుంటారో మీ ఇష్టం.. ఇదుగో మరదలా.. ఈ రాత్రి ముచ్చట్లు రేపు చెప్పకపోతే ఊరుకునేది లేదు.. ఆల్ ది బెస్ట్'' చెప్పింది పద్మ. అందరూ వెళ్లిపోయారు.

మనశ్శరీరాలు మనోవల్లభుడి సాహచర్యం కోసం తపించిపోతున్నా, స్త్రీ సహజమైన జంకు ఆమెను వెనక్కి లాగుతోంది.

''అమూల్యా''

''ఊఁ..'' అంది మంద్రస్వరంతో.

''ఇలారా'' మంచం ప్రక్కనే నిలబడి ఉన్న ఆమెను చేయి పట్టిలాగి తన సరసన కూర్చోబెట్టుకున్నాడు అనిరుద్ధ్.

''చిన్నప్పటి మా స్నేహంలో నీకు చెప్పని ముచ్చట ఒకటి మిగిలిపోయింది. అమూల్యా.. అది.. ఇక్కడే చెప్పాలి'' అర్ధాంగి చేతి గాజులను సవరించాడు అనిరుద్ధ్.

''ఏంటది?''

చెప్పనారంభించాడు అనిరుద్ధ్.

''మా టెన్త్ పరీక్షలయిపోయిన ఆ సెలవుల్లో సూరిబాబు వాళ్ల పెద్దన్నయ్యకి పెళ్లి జరిగింది. అప్పుడూ ఇలాగే.. ఈ తోటలోనే వాళ్లకి ఫస్ట్‌నైట్ ఏర్పాటు చేశారు. ఇంటిల్లిపాదీ దంపతులను ఒంటరిగా వదిలిపోతుంటే నేను, సూరిబాబు మాత్రం వెనక్కినక్కాం''

''ఎందుకు?''


''వినూ.. అప్పటివరకు శోభనం సీన్లు సినిమాల్లో చూడడమే తప్ప, నిజానికి అదంటే ఏంటో తెలియదు. ఆ రహస్యం తెలుసుకోవాలన్న జిజ్ఞాస మా మెదళ్లని దొలిచేస్తోంది. అందుకే ఆ రహస్యం తెలుసుకోవాలని మేమక్కడే ఉండిపోయాం''

ముక్కున వేలేసుకుని, చిరుకోపం నటిస్తూ ''తప్పుకదూ!'' అంది అమూల్య.

''తప్పని తరువాత తెలిసిందిలే'' క్రీగంట ఆమెను చూశాడు అనిరుద్ధ్.

''ఆపైన''

''ఇద్దరం కిటికీ ప్రక్కన దొంగల్లా దాక్కున్నాం. ఏం జరుగుతుందో చూడా



లన్న ఆతృతతో పొంచి పొంచి చూస్తున్నాం. చుట్టుప్రక్కల ఎవరూ లేరన్న ధీమాతో వాళ్లు యధేచ్ఛగా తమ తపనల్ని చల్లార్చుకునే ప్రయత్నంలో పడ్డారు. మాలో ఉత్కంఠ తారాస్థాయికి చేరుతూండగా పడ్డాయి..''

''ఏంటీ కిటికీ తలుపులా?'' ఉద్విగ్నత ఆపుకోలేని అమూల్య అడిగింది.

''కాదు..పిడుగుల్లాంటి పిడిగుద్దులు''

''ఎవరు కొట్టారు?''

''బండిలో మేమిద్దరం కనబడకపోయేసరికి సూరిబాబు వాళ్ల మామయ్యకి సందేహం వచ్చి వెనక్కి తిరిగి వచ్చాడు. మేం చేయబోతున్న ఘనకార్యం ఆయన కంటపడింది. అంతే..వీపు విమానం మోత మ్రోగింది. భడవల్లారా! మీరెంత? మీ వయసెంత? అని కేకలేసి నాలుగు తగిలించాడు. దెబ్బలు తిని మేం ఏడుస్తూ ఉంటే జాలిపడి మమ్మల్ని దగ్గరకు తీసుకొని 'మీ వయసులో ఉన్న పిల్లలకి ఆడ-మగ మధ్యనేం జరుగుతుందో తెలుసుకోవాలనుకోవడం సహజమే గాని..దానికిది సరైన సమయం కాదు. అప్పుడే పుట్టిన ఆవుదూడకి పాలుకుడవడం నేర్పక్కరలేదు. నీళ్లలో ఉండే చేపపిల్లకి ఈత నేర్పించనవసరం లేదు. ఆమని రాగానే కూయాలని కోయిలకెవరూ చెప్పరు. యుక్త వయసు రాగానే ప్రకృతి దానంతట అదే మనిషిలో పుట్టే కోరికలను ప్రేరేపించి సృష్టి రహస్యాలను తెలియజేస్తుంది. అంతవరకూ ఏ వ్యక్తైనా సరే నిగ్రహంతో కూడిన జీవన విధానాన్ని అవలంబించాలి'' అంటూ సున్నితంగా మాకర్థమయ్యే రీతిలో చెప్పాడు. అంతేకాదు..కొట్టినందుకు పెనాల్టీగా ఐస్‌క్రీమ్స్ కూడా ఇప్పించాడు'' చెప్పడం ఆపాడు అనిరుద్ధ్.

పగలబడి నవ్వింది అమూల్య. ఎగసిపడే హృదయం మీద మెడలోని హారం నాట్యాలాడింది.

ఇంకా ఉబికి వస్తున్న నవ్వును పెదవుల మాటునే అదిమిపెట్టే ప్రయత్నం చేస్తూ ''ఇంతకీ..శోభనం అంటే ఏమిటో తెలుసుకున్నారా?'' అంటూ అడిగేసి, తరువాత..సిగ్గును ప్రక్కకు నెట్టి అలా అడిగినందుకు నాలిక్కరుచుకుంది అమూల్య.

కోరికతో ఆమెను తనకేసి అదుముకుంటూ ''ఊ..తెలిసింది..అయినా థీరిటికల్ నాలెడ్జ్ తప్ప ప్రాక్టికల్ నాలెడ్జ్ సున్నా..నిజం..నమ్ము నేనింకా బ్రహ్మచారినే..అమ్మతోడు..నువ్వు కాస్త కోపరేట్ చేస్తే ప్రాక్టికల్స్ మొదలెడతాను'' అన్నాడు అనిరుద్ధ్ అల్లరిగా.

అమూల్య కళ్లు మూసుకుంది కలవరంగా. అతడి చిలిపి చేష్టలకి ఎదపొంగింది. ఆ స్పందనను ఆహ్వానంగా అర్థం చేసుకున్న అనిరుద్ధ్ శృంగార కావ్యంలో తదుపరి ఘట్టం లిఖించేందుకు ఉద్యుక్తుడయ్యాడు.

ముద్దరాలి ముగ్ధమోహనమైన మోముని ముద్దులతో ముంచెత్తాడు.

ప్రేమాతిరేకంతో అదురుతున్న ఆమె కెమ్మోవిని మునిపంట నొక్కాడు.

విభుడు చేస్తున్న వలపు విన్యాసాలకు తాళలేనట్లుగా ఆమె చేస్తున్న కలకూజితాల్లాంటి మధురనాదాలు, అతడి ఉత్సాహాన్ని రెట్టింపు చేసే ఉత్ప్రేరకాలైనాయి. విరుచుకు పడుతున్న సముద్ర కెరటంలా తనని కమ్ముకుంటున్న అతడి ప్రణయావేశాన్ని తట్టుకోవడం కాస్త కష్టంగానే తోచినా, ఇష్టంగానే దాన్ని భరిస్తోంది అమూల్య.

తొలి సంగమం..అచ్చం కవులు వర్ణించినట్లే అతి రమ్యంగా, అత్యంత అద్భుతంగా జరిగిపోయింది.

ఆ సమాగంమలో సంకోచాలకు సందు లేదు. సిగ్గు బిడియాలకు తావు లేదు. చెమట చిత్తడిలో తడిసి ముద్దైన దేహాలు సేద తీరుతూండగా గుసగుసగా ఆమె చెవిలో అడిగాడు అనిరుద్ధ్ ''ఎలా ఉంది? తొలి అనుభవం?''

మౌనాన్ని శరణు జొచ్చి, సిగ్గుతో కళ్లు మూసుకుంది అమూల్య.

''మీ ఫ్రెండ్ నాన్సీ చెప్పినట్లుగా నాస్టీగా ఉందా! లేకపోతే..మీ పొరుగింటి దమయంతి చెప్పినట్లు దారుణంగా ఉందా!''

ఏవో లోకాల్లో విహరిస్తున్న అమూల్య ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

ఇవి..ఇవన్నీ ఇతడికెలా తెలుసు?

ముద్దుగులాబీలాంటి ముదిత ముఖంపై ప్రత్యక్షమైన ప్రశ్నార్థకాల్ని ఒక చూపుతో చదివేశాడు అనిరుద్ధ్.

''ముందుగా నీకు సారీ చెప్పాలి అమూల్య!''

''ఎందుకు?'' ఆశ్చర్యంగా అడిగింది ఆమె.

''నీ అనుమతి లేకుండా నీ డైరీ చదివినందుకు''

''నా డైరీ చదివారా! ఎప్పుడూ?'' విస్తుబోయింది అమూల్య.

ఆమె చెక్కిలి సుతారంగా నిమురుతూ ''నీకు నచ్చిన చీరలు కొనిపెట్టమని అమ్మ చెబితే మీ ఇంటికి వచ్చాను ఆరోజు. అప్పుడు నువ్వింట్లోలేవు. ఎవరో ఫ్రెండ్‌ని కలవడానికి వెళ్లావనీ, అరగంటలో వస్తావనీ మీ అమ్మగారు చెప్పడంతో నీకోసం వెయిట్ చేస్తూ నీ గదిలో కూర్చున్నాను. పొందికగా గదిని సర్దుకున్న నీ అభిరుచిని మెచ్చుకుంటూనే చుట్టూ పరికిస్తున్న నాకు 'నీ హృదయం' అదే..నీ డైరీ కనిపించింది. సంస్కారం కాదని తెలిసినా నా గురించి నువ్వేం వ్రాసుకున్నావో తెలుసుకోవాలన్న తపన దాన్ని చదవమని ప్రేరేపించింది'' పెద్ద పెద్ద కళ్లను ఆల్చిప్పలాగా తెరచుకొని నోరప్పగించి వింటోంది అమూల్య.

''తొలి అనుభవం గురించి నీ స్నేహితురాళ్లు చెప్పిన మాటలను మనసుకి పట్టించుకున్న నువ్వు..భార్యాభర్తల నడుమ సున్నితంగా సాగిపోవలసిన శృంగారం గురించి లేనిపోని భయాలను పెట్టుకున్నావని అర్థమైంది'' పనిలో పనిగా అనిరుద్ధ్ చేతులామె వయ్యారాలతో సయ్యాటలాడుతూనే ఉన్నాయి.

''మరి..మరి..ఇక్కడికెందుకు తీసుకొచ్చినట్లు?'' అయోమయంగా అడిగింది.

''మన తొలిరేయికి ముందే నీ మనసులో ముద్రించుకుపోయిన భావాలను, అర్థం పర్థం లేని అనుమానాలను దూరం చేయడం నా బాధ్యత అనిపించింది. తొలికలయిక జీవితాంతం జ్ఞాపకం ఉంచుకోవలసిన మధురానుభూతిగా మిగిలిపోవాలంటే, మానసికంగా నిన్ను ప్రిపేర్ చేయాలి. నాకు తెలిసి...జ్ఞానం వచ్చిన దగ్గర్నుంచి నేను చూసిన ఏకైక ఆదర్శకుటుంబం సూరిబాబుది. ఆనందకరంగా సాగిపోయే దాంపత్య జీవనమే, ఉన్నతమైన కుటుంబ వ్యవస్థను ఏర్పరస్తుందని నా నమ్మకం. శాంతి నిలయం లాంటి ఈ ఇంట్లో కొన్నాళ్లు గడిపితే నీ మనసులోని ఆందోళనంతా మాయమౌతుందని నాకనిపించింది. నా శ్రమ వృథా పోలేదు'' మురిపెంగా ఆమెను అల్లుకున్నాడు అనిరుద్ధ్.

అమూల్య కళ్లు చెమర్చాయి. తాళికట్టిన హక్కుతో తన శరీరం దోచుకోవాలని చూడకుండా మనస్సుని మీటి, రసరమ్యమైన స్పందనలు రేకెత్తించి తద్వారా తనువుని శృతి చేసిన అతడి సహనానికి మనసులోనే జోహార్లు అర్పించింది.

ఆర్తిగా అతడి నుదుటిని చుంబించింది. ఆ స్పర్శాసౌఖ్యం అతడి పట్ల ఆమెకు గల ప్రేమానురాగాలను వ్యక్తపరిచింది.

అంతే..మదనుడు మళ్లీ తనలోకి పరకాయ ప్రవేశం చేసినట్లుగా రెట్టించిన ఉత్సాహంతో మదనకదన రంగంలోకి దూకాడు అనిరుద్ధ్.

★ ★ ★

పదిరోజుల తరువాత- ఆకాశయానం చేస్తూ అమెరికాలో అడుగుపెట్టారు పడుచు జంట, గుండెగదులు నిండా పొందుపరుచుకున్న అనుభూతి పర్వాలను నెమరువేసుకుంటూ.

☆

